అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి 1
మంగళవారం 23 మే 2023

భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు


నివాళి అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయం ఆధ్వర్యంలో మ్యాదరి భాగ్యరెడ్డి వర్మ 135 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వెంకటేష్, టీఎన్జీవోఎస్ కార్యదర్శి బి. సాయిలు, అధికారులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి సహకరించాలి


విప్‌ను సన్మానించిన పాస్టర్‌లు

నవతెలంగాణ-దోమకొండ

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సాప శ్రీనివాస్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను సోమవారం కామారెడ్డి లోని తన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధి కోసం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్ కుమార్, దోమకొండ జడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, జిల్లా పాస్టర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎ జే రత్నాకర్, హెూసన్న, కృపాకర్, పులి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో ప్రతిభ చాటండి

- జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకోవాలి
- సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



క్రీడా జ్యోతి అందజేస్తున్న మంత్రి వేముల, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి, జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, ఎమ్మెల్సీ రాజేందర్.. మాట్లాడుతున్న వేముల

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా చీఫ్ మినిస్టర్ కప్ - 2023 క్రీడా పోటీలను నిర్వహిస్తోందని రాష్ట్ర రోడ్లు - భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. జిల్లా నుంచి అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి వేముల పిలుపునిచ్చారు. సోమవారం రాష్ట్ర ఆర్టీసీ సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పి చైర్మన్ దాదన్నగారి విఠల్రావు, ఎమ్మెల్సీ రాజేశ్వర్, మేయర్ నీతూ కిరణ్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులతో కలిసి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి సీ.ఎం కప్ - 2023 జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. జాతీయ స్థాయిలో ప్రతిభను చాటిన క్రీడాకారుల చేతుల మీదుగా క్రీడా జ్యోతిని అందుకుని జిల్లా స్థాయి పోటీలు ప్రారంభమైనట్లు ప్రకటించారు. క్రీడా స్ఫూర్తిని చాటుతూ, సహృద్భావ వాతావరణంలో పోటీలను విజయవంతం చేస్తామని క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. వాలీబాల్, ఖో-ఖో కబడ్డీ, ఆర్చరీ క్రీడాకారులను పరిచయం చేసుకుని లాంఛనంగా పోటీలకు శ్రీకారం చుట్టారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ చూపు ఎల్లప్పుడూ గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతి పైనే కేంద్రీకృతమై ఉంటుందన్నారు. ఈ దిశగానే గ్రామీణ ప్రాంత క్రీడాకారుల కోసం ప్రతి గ్రామ పంచాయతీలో, పట్టణ ప్రాంతాల్లోని అన్ని వార్డులలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారని అన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. జిల్లా నుండి మలావత్ పూర్ణతో పాటు నిఖత్ జరీన్, యెండల సౌందర్య, గుగులోత్ సౌమ్య, హుసాముద్దీన్, ఇషాసింగ్ వంటి అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి వేముల పిలుపునిచ్చారు. క్రీడల నిర్వహణకు సహకరిస్తున్న పీ.డీలు, పీ.ఈ.టీలను మంత్రి అభినందించారు.

ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పి చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు, మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడే క్రీడలను ప్రతి ఒక్కరు అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరాశ చెందకుండా గెలుపొందిన వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని హితవు పలికారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. చీఫ్ మినిస్టర్ కప్ -2023 క్రీడా పోటీల్లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని, ఈ నెల 15 , 16 , 17 వ తేదీలలో మండల స్థాయిలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు ప్రస్తుతం జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ నెల 28 నుండి 31 వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో జరుగనున్న పోటీల్లోనూ జిల్లాకు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు సీ.ఎం కప్ క్రీడా పోటీలు చక్కటి అవకాశం అని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు చిత్రా మిశ్రా, చంద్రశేఖర్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవ రెడ్డి, కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఆర్డీఓ రవి పాల్గొన్నారు.



ధాన్యం అన్ లోడింగ్ ఆగొద్దు

అవసరమైన చోట ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకోవాలి : మంత్రి సమీక్ష

రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం తరలింపు విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి వేముల సూచించారు. ప్రధానంగా రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను వెంటదివెంట అన్ లోడ్ చేసుకునేలా చూడాలని, ఏ ఒక్క రైస్ మిల్లు వద్ద కూడా జాప్యం జరుగకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సోమవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం సేకరణ పురోగతిని సమీక్షించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలు, వాటి తరలింపు తదితర వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే 70 శాతం ధాన్యం సేకరణ పూర్తయ్యిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంత్రి దృష్టికి తెచ్చారు. రైస్ మిల్లుల వద్ద 48 గంటలకు పైగా ధాన్యం అన్ లోడింగ్ జరుగని వాహనాలు ఒకింత ఎక్కువ సంఖ్యలో ఉన్నాయని గుర్తించిన మంత్రి వేముల, సంబంధిత క్లస్టర్ల పరిధిలో పర్యవేక్షణ విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)లను సమీక్షా సమావేశం నుండే ఫోన్ ద్వారా సంప్రదించి అన్ లోడింగ్లో జాప్యానికి గల కారణాలను ఆరా తీశారు. రెండు, మూడు రోజుల పాటు ధాన్యం అన్ లోడింగ్ నిలిచిపోతే మీరేం చేస్తున్నారంటూ మంత్రి మందలించారు.


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌బాబు

ఐక్య పోరుతోనే ఇండ్లు, ఇంటి స్థలాలు

- అర్హులైన పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పేదలందరూ కలిసి ఐక్యంగా పోరాటాలు చేయడం ద్వారానే ఇండ్ల స్థలాలను సాధించుకోగలమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు తెలిపారు. పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరుపేదలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. గత దశాబ్ద కాలం పైగా నగరంలోని నిరుపేదలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కానీ ఇండ్ల స్థలాలు కానీ ఇవ్వకపోవడంతో పేదలు ఇంటి అద్దెలను భరించలేక ఆర్థిక ఇబ్బందులతో అర్ధాకలితో జీవిస్తున్నారని తెలిపారు. నగరం పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధనవంతులు ఆక్రమించుకొని ప్రభుత్వ భూములను కాజేస్తున్నారని వాటిని పేదలకు పంచి ఇండ్ల నిర్మాణం కోసం రుణాలను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం కాలయాపన చేస్తే ప్రభుత్వ భూముల్లో పేద ప్రజలు భూ పోరాటానికి సిద్ధపడతారని అందుకు ఈ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమైక్య పోరాటాల ద్వారా మాత్రమే హక్కులను సాధించుకోవచ్చు అని అందుకు పేదలంతా ఐక్యంగా తమ హక్కుల కోసం జరిగే పోరాటాల్లో కదిలి రావాలని ప్రభుత్వ భూములను పేదలకు దక్కే వరకు పోరాటాలకు సిద్ధపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శి పి సూరి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోవర్ధన్, నగర కమిటీ సభ్యులు సుజాత, కృష్ణ, కే రాములు, అబ్దుల్, నరసయ్య తదితరులతోపాటు పెద్ద ఎత్తున పేదలు పాల్గొన్నారు.

గంగపుత్రులకే చైర్మన్ పదవి ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న గంగపుత్రులు

నవతెలంగాణ-ధర్పల్లి

తెలంగాణ రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్‌గా సాంప్రదాయం ప్రకారం గంగపుత్ర కులస్తుల వారికే నియమించాలని కోరుతూ సోమవారం మండలం లోని గంగపుత్ర సంఘానికి చెందిన గూండ్ల,బెస్త గంగపుత్ర జాతికి చెందిన సంఘ సభ్యులు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగపుత్రుల సంఘం మండల అధ్యక్షుడు దశరథం మాట్లాడుతూ తమకు జీవన ఆధారం చేపలు పట్టుకోవడం తప్ప మరే ఇతర వ్యాపారాలు లేవని, రాష్ట్రంలోని చెరువుల్లో వాట మొదటి ప్రాధాన్యత గంగపుత్రులకే చెందుతుందని సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తుచేశారు. కానీ ముదిరాజ్ కులస్థుడైన పిట్టల రవీందర్‌ను రాష్ట్ర మత్స్య పారిశ్రామిక కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా నియమించి మా ఆత్మగౌరవాన్ని, మా పేదరికాన్ని అవమాన పరిచారని తెలిపారు. ముదిరాజ్ కులస్తులు సీజనేబుల్ వృత్తిలో భాగంగా పండ్లు, ఫలాలు అమ్ముకుంటారని, తోటలు, కూరగాయలు, పండ్ల తోటలు గుత్త పట్టుకుంటూ వ్యాపారాలతో ముదిరాజ్‌లు తమకంటే ముందున్నారని తెలిపారు. కానీ కేవలం చేపలు పట్టుకోవడమే వృత్తిగా ఉన్నామని, ఇచ్చిన మాటకు కట్టుబడి మా ఆత్మగౌరవాన్ని పెంచే విధంగా తమ కులస్తులకే ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, రాఘవేందర్, శ్రీనివాస్, రాజన్న, శ్రీను, మల్కన్న, హరీష్ పాల్గొన్నారు.

కబ్జా భూమిని స్వాధీనం చేసుకోవాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన గ్రామస్తులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ధర్పల్లి మండలంలో దుబ్బాక గ్రామంలో 979 సర్వేనెంబర్ లో ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న కబ్జాదారులపై చర్యలు తీసుకొని, అసైన్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకో వాలని దుబ్బాక గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున తరలివచ్చి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి దుబ్బాక గ్రామంలో గల 979 సర్వే నెంబర్లు గల భూములపై విచారణ చేపట్టి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలంలోని బ్రహ్మజీవాడి గ్రామంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కూరెల్లి జ్యోతి నర్సింలు ప్రారంభించారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని 18 ఏండ్లు నిండిన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో కంటి లోపాలు ఉన్నవారు తప్పకుండా ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చిన్న గొల్ల రాములు, ఎంపీటీసీ శాంతాబాయి నారాయణరావు, కృష్ణాజివాడి సర్పంచ్ జంగభూషణం, సొసైటీ డైరెక్టర్ ప్రభాకర్ రావు, టీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు రమేష్ రావు డాక్టర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

వీవోఏల డిమాండ్‌లు నెరవేర్చాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా, వినతి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి నినాదాలు చేస్తున్న వీవోఏలు, నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వీవోఏల డిమాండ్‌లు నెరవేర్చాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్‌లు నెరవేర్చే వరకూ వారి సమ్మె కొనసాగుతుందని స్పష్టంచేశారు. వీవోఏల రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఐకేపీ వీవోఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి పీడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, యూనియన్ టౌన్ అధ్యక్షులు రాజనర్సు మాట్లాడారు. వీవోఏలపై ఉన్నతాధికారుల వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీడీ స్పందించి వీవోల డిమాండ్‌ను ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని తెలిపారు. అలాగే ఏపీఎంలు, సీసీలు వేధింపులు మానుకునే విధంగా లెటర్స్ రాపిచ్చుకుంటామని, వేధింపులు జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏల జిల్లా నాయకులు బాలరాజుచ, రాజలింగం, సరిత, శివరాం, శివ, అనసూయ, సురేందర్, మల్లేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ, యుఆర్ఎస్ సిబ్బందికి
పనికి తగ్గ వేతనం చెల్లించాలి

- టీఎస్ యూటీఎఫ్ డిమాండ్



నినాదాలు చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ ప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అనాథ, వెనకబడిన బాలికలకు విద్యను అందించడం కోసం 2013లో ఏర్పాటు చేసిన కస్తూరిబా బాలిక విద్యాలయాల్లో , అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సేవలను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్న సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి వారి పోస్టు కనీస వేతనాన్ని చెల్లించాలని, ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ధర్నా చౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.సత్యానంద్ మాట్లాడుతూ.. కేజీబీవీ, యు ఆర్ ఎస్ సిబ్బందికి కనీస వేతనాలను అమలు చేయకపోవడంతో శ్రమ దోపిడీకి గురవతున్నారని, సెలవు నిబంధనలు అమలు చేయాలని, పిల్లల సంఖ్య కు తగినట్లుగా సిబ్బందిని నియమించాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని, నైట్ డ్యూటీ నుండి విముక్తి చేయడానికి కేర్ టేకర్లను నియమించాలని కోరారు. పార్ట్ టైం ఉద్యోగులను ఫుల్ టైం సి ఆర్ టి లుగా గుర్తించాలని, యు ఆర్ ఎస్ లలో తొమ్మిది, పది తరగతులను ప్రారంభించాలని, సొంత భవనలను నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జూన్8న హైదరాబాద్‌లో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో టీ ఎస్ యూటీఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షులు సిరాజుద్దిన్, జిల్లా కార్యదర్శులు గంగాధర్, రాజారాం, కేజీబీవీ అండ్ యు ఆర్ ఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచారాల జాతర



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అన్ని గ్రామాల్లో పదవ తరగతి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత ఫలితాలు వెలివడిన నుండి గ్రామాల్లో కాలేజీల ప్రచార జాతర ఊపందుకుంది. పాసైన విద్యార్థుల ఇండ్లలో కి వివిధ కాలేజీల యజమానులు, లెక్చరర్‌లు వచ్చి తమ కాలేజీతో జాయిన్ చేయించాలని, తమ విద్యాసంస్థల విశిష్టతలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. మరికొందరు ఫీజులు తక్కువగా తీసుకుంటామని ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద, ముఖ్యమైన ప్రదేశాల్లో బస్టాండ్ ప్రాంగణాల్లో ప్రయివేటు విద్యాసంస్థల ప్రచార బ్యానర్‌లు దర్శనమిస్తున్నాయి.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో పారిశుధ్య వారోత్సవాలు 9 వ వార్డులో మున్సిపల్ కమిషనర్ జీవన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జీవన్ మాట్లాడుతూ పారిశుధ్య వారోత్సవాలో భాగంగా ఆర్ఆర్ఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు వార్డుల్లో పొడి చెత్తను సేకరించారు. మెరా లైఫ్ మేరా స్వచ్ షెహర్‌లో భాగంగా మున్సిపాలిటీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు విజయలక్ష్మి మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో ఆవు మృత్యువాత


మృత్యువాత పడ్డ ఆవు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

తిమ్మారెడ్డి తండాలో సోమవారం ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్‌షాక్‌తో మృతిచెందినట్టు తండా సర్పంచ్ శ్వేతా తెలిపారు. తిమ్మారెడ్డి సర్పంచ్ తెలిపినా వివరాల ప్రకారం మాలవత్ రాములు ఉదయం ఆవులను మేపటానికి తీసుకెళ్లే సమయంలో తండా వద్ద ఉన్న ట్రాన్సార్మర్స్ కి ఆవు తగిలి కరెంట్ షాక్ తగిలి మృతి చెందినట్లు తెలిపారు. సుమారు 70 వేల నష్టం జరిగినట్ల తెలిపారు. అధికారులు చర్యలు తీసుకొని భాదితులకు న్యాయం చేయాలని కోరారు.

చిరుత దాడిలో దుడ్డె మృత్యువాత

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండల కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో తన పశువుల కొట్టాంలో కట్టేసి ఉన్న దుడ్డెపై ఆదివారం రాత్రి చిరుత దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందిందని బాధితుడు ఆవుల మనోహర్ వాపోయాడు. ఆదివారం సాయంత్రం పశువుల కొట్టంలో కట్టేసి ఇంటికి వెళ్లగా.. తెల్లారి వచ్చి చూసే సరికి దుడ్డెమృతిచెందినట్టు తెలిపారు. అటవీ, పశువైద్యాధికారులు పంచనామ నిర్వహించారు.

పుట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్‌కు చెందిన పుట్‌బాల్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. సీఎం కప్‌లో భాగంగా జిల్లా స్థాయిలో ప్రతిభ చాటడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది, ఈ నెల 29-31వ తేదీల వరకు ఎల్‌బీ స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్టు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైనందుకు ఎమ్‌డి సమీరోద్దీన్ షేక్ ముగ్దాం , ఎం.డి ముజీర్ , ఎం.డి.అజీమ్ అభినందనలు తెలిపారు.

ప్రజావాణికి 116 ఫిర్యాదులు..

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 116 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఓ చందర్, జెడ్పీ సీఈఓ గోవింద్, డీపీఓ జయసుధకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సన్మానం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని మందర్న గ్రామానికి చెందిన పలువురు ప్రతిభావంతులను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ గంగాధర్ సోమవారం ఘనంగా సన్మానించారు. సామాజిక కార్యకర్త సిర్సే విఠల్ దళిత రత్న అవార్డు పొందడం, జలగరి నగేష్ మహారాష్ట్ర ప్రభుత్వ పోలీసుగా ఎంపికైనందుకు, అలాగే గ్రామానికి చెందిన విద్యార్థి సిర్సే ప్రణవి పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 10.10 జీపీఏ సాధించిన మండలంలో పేరు ప్రఖ్యాతులు సాధించడంతో వారిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాగర్ బాయి, రమేష్, నాగురావు, దత్తు, కార్యదర్శి శ్రీనివాస్, కారోబార్ గంగారాం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-సిరికొండ

కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ మాలావత్ మాన్సింగ్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని తూంపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో చాలామంది కంటి సమస్యలతో బాధపడుతున్నారని వైద్యం చేయించుకోవడానికి కూడా డబ్బులు లేని వారు చాలామంది ఉన్నారని ప్రభుత్వం అలాంటి నిరుపేదల కోసం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని కావున సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పల్లె బాలమణి మల్లేష్, రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ మంజుల, ఉప సర్పంచ్ నాగవ్వ, వైద్యులు అరవింద్, అనంతరావు, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో 30 మంది యువకుల చేరిక

నవతెలంగాణ-నందిపేట్

మండల కేంద్రంలోని పాతూర్ గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన సుమారు 30 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీ తీర్థం సోమవారం పుచ్చుకున్నారు. వీరికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రతి ఒక్కరు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు భాస్కర్, ఉప సర్పంచ్ కొత్తూరు భరత్, వార్డు మెంబర్లు గంధం సాయిలు, తల్వేద రాజేందర్, యూత్ అధ్యక్షుడు దినేష్, సీనియర్ యూత్ నాయకులు బలగం పంత అధ్యక్షుడు గాండ్ల సంతోష్, దర్వాడి అశోక్, గంధం రాజశేఖర్, ఉమ్మెడ అశోక్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశాలతో వెట్టిచాకిరి చేయించొద్దు

- అర్హత పరీక్ష రద్దు చేసి కనీస వేతనం 18 వేలు చెల్లించాలని
- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు, అధికారులకు వినతి

నవతెలంగాణ-విలేకరులబృందం

ఆశాలతో వెట్టిచాకిరీ మానివేయించి కనీస వేతనం 18 వేలు మంజూరు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పారితోషికం లేని అదనపు పనులు చేయించొద్దని, అర్హత పరీక్షను రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు సోమవారం నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఆశావర్కర్లకు ఎగ్జామ్ పెట్టే ఆలోచనలను విరమించుకోవాలి..

కంఠేశ్వర్ : ఆశావర్కర్లకు ఎగ్జామ్ పెట్టే ఆలోచనను విరమించుకోవాలని జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వారీగా వినతిపత్రాలు అందజేస్తున్నామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లాలో పీహెచ్‌సీల వారిగా మెడికల్ అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఎగ్జామ్ పెట్టి అందులో అర్హత సాధించిన వాళ్లనే కొనసాగించి మిగతా వాళ్లను తీసేయాలన్నా ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గత 16 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాలలో పేదలకు అందుబాటులో ఉంటూ వారికి వైద్యం చేస్తూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న ఆశావర్కర్లపై ఇటువంటి అనాలోచిత విధానాన్ని అమలు చేయడం దుర్మార్గమని అన్నారు. స్పూటమ్ డబ్బాలను ఆశావర్కర్ల ద్వారా మోపించడంతో రోగికి ఉండే టీబీ రోగాలు ఆశా వర్కర్లకు కూడా అంటుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వేధింపులు ఆపాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. విజయ, రాణి, లక్ష్మీ నవనీత ఆశావర్కర్లు పాల్గొన్నారు.



కంఠేశ్వర్ : అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నాయకులు



జుక్కల్ : వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ఆశావర్కర్ల అర్హత పరీక్షను రద్దు చేయాలి..

బోధన్ : ప్రభుత్వం ఆశ వర్కర్లకు నిర్వహించతలపెట్టిన అర్హత పరీక్ష విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉప వైద్యాధికారి డాక్టర్ విద్యకు, రాకాసిపేట్ పీహెచ్‌సీలో ఆశ వర్కర్లు డాక్టర్ అంజలి జాంకర్‌కు వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు యేశాల గంగాధర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశావర్కర్లకు నిర్వహించతలపెట్టిన అర్హత పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కనీస వేతనం నెలకు రూ.18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఐదు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న యూనిఫామ్‌లు ఇవ్వాలని, ఆశావర్కర్లకు పనిభారం తగ్గించాలని, అర్హులైన ఆశావర్కర్లకు ఏఎన్ఎంలు నియమించాలని, ఆశావర్కర్లపై రాజకీయ నాయకుల, ప్రభుత్వ ఉద్యోగుల బెదిరింపులు అజమాయిషీ తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ జిల్లా నాయకురాలు విజయ, దివ్య, అనిత, పద్మ, జాకీరా, కల్పన, పుష్ప, రాజేశ్వరి, అనురాధ, శ్రీలేఖ, రాధిక, సుజాత, శ్రీలేఖ, ఉమా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల పేరుతో ఆశలపై ప్రభుత్వం కుట్ర..

వర్ని (రుద్రూర్) : పరీక్షల పేరుతో ఆశా కార్యకర్తలను రాష్ట్ర ప్రభుత్వం తొలగించే కుట్ర పన్నుతుందని వెంటనే పరీక్షలను రద్దుచేసి యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు సోమవారం రుద్రూర్ పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేపట్టారు. మెడికల్ ఆఫీసర్ ఆయేషా సిద్ధిఖీకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆశా యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీల ఎదుట ఆందోళనలు చేపట్టామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ తెలిపారు. పదివేల ఫిక్స్‌డ్ వేతనంతో పాటు, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు మేకల మల్లేష్, ఆశా కార్యకర్తలు లత, పుష్ప, ప్రేమల, లక్ష్మి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : ఆశాల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ జుక్కల్ ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఒక రోజు ఆశాలు నిరసన దీక్ష చేపట్టారు. సిఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్ గొండ ఆశాలకు అర్హత పరీక్షలు రద్దు చేయాలని, పేస్కేల్ అమలు చేసి 18 వేల వేతనం ఇవ్వాలని, ఆశాల జీతాలను నెల రెండవ తేదిన చెల్లించాలని, పారితోషికం లేని అదనపు పనులు చెయించొద్దని కోరారు. టీబీ పరీక్షల కోసం తెమడ తీసుకొచ్చే పని ఆశాలకు ఇవ్వొద్దని, టీబీ, లెప్రసీ, కంటి వెలుగు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 32 రకాల రిజిస్టర్‌లను ప్రభుత్వమే ప్రింట్ చేసి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

నసురుల్లాబాద్ : ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం బీర్కూర్ స్థానిక ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు గౌరవ వేతనం రూ. 20 వేలకు పెంచాలని, సంక్షేమ పథకాలు, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని కోరారు. వైద్యాధికారి డాక్టర్ అఖిల కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గల్ఫ్ ఏజెంటు బషీర్‌ను వెంటనే అరెస్టు చేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

గల్ఫ్ ఏజెంటు బషీర్‌ను వెంటనే అరెస్టు చేయాలని ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహనాయుడు తెలిపారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గత ఆరు నెలల క్రితం డిచ్‌పల్లిలో ఆర్కె ట్రావెల్స్ పేరుతో ఆఫీస్ పెట్టి వందలాది మందిని ముంచి పారిపోయిన షేక్ బషీర్ అనే ఏజెంటును ఇంతవరకు పట్టుకోకపోవడానికి కారణం ఏమిటో డిచ్‌పల్లి పోలీసులు చెప్పాలని కోటపాటి డిమాండ్ చేశారు. టెక్నాలజీ ఇంతగా అభివృద్ధి చెంది దాదాపు అన్ని రకాల కేసులను రెండు మూడు రోజుల్లోనే ఛేధిస్తున్న పోలీసులకు బషీర్‌ను పట్టుకోవడం చేతకావడం లేదంటే నమ్మశక్యంగా లేదని తెలిపారు. ఈ విషయంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ జోక్యం చేసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో షేక్ బషీర్, బాధితుల సంఘం కన్వీనర్ రాకేష్, రైతు నాయకులు నక్కల చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశాన్ని బహిష్కరించిన విపక్ష కౌన్సిలర్లు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ సాధారణ సమావేశం సోమవారం నిర్వహించగా విపక్ష కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించారు. సమావేశంలో బీజేపీ కౌన్సిలర్లు బాయావత్ సాయికుమార్, కొంతం మంజుల మురళీధర్, ఆకుల సంగీత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంఘం భవనాల అదనపు గదులకు భూమిపూజ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని బర్మ వారి నడిపి సంఘం, బర్మ వారి చిన్న సంఘం, రజక సంఘాల అదనపు గదుల నిర్మాణానికి బీఆర్ఎస్ నాయకులు సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కృషితో బర్మ వారి నడిపి సంఘానికి రూ.3లక్షల 50 వేలు, బర్మ వారి చిన్న సంఘానికి రూ.3లక్షల 50 వేలు, రజక సంఘానికి రూ.4 లక్షలు సంఘాల అదనపు గదుల నిర్మాణానికి మంజూరైనట్లు తెలిపారు. భవన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రశాంత్‌రెడ్డికి కుల సంఘాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, ఏర్గట్ల సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య, బీఆర్ఎస్ నాయకులు బద్దం ప్రభాకర్, కుమ్మరి సహదేవ్, రొక్కెడ మోహన్, దొబ్బల రాజేష్, ఇబ్రహీంపట్నం నరేష్, దేవుడు నర్సయ్య, కులసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వరికి నిప్పు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన కొమ్ముల మోహన్‌రెడ్డి (30 గుంటలు), కొమ్ముల గంగయ్య (30 గుంటలు) అనే ఇద్దరు రైతులకు సంబంధించి కొత్తపల్లి శివారులోని వరి పంటకు గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం సాయంత్రం నిప్పు పెట్టారు. దీంతో ఇద్దరు రైతులకు సంబంధించి వరి పంట పూర్తిగా కాలిపోయిందని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంగారాం తెలిపారు. కాగా కాలిపోయిన వరి పంటను సోమవారం పరిశీలించారు. నష్టం అంచనా దాదాపు రూ.92వేలుగా నిర్ధారించారు. ఈ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపించనున్నట్టు పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని ఇస్లాంపూర్ కాలనీలో ఎస్డీఎఫ్ నిధుల కింద రూ. 20 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ పత్తి లక్ష్మణ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోచారం సురేందర్ రెడ్డి పాల్గొని మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని పేర్కొన్నారు. మాజీ ఎంపీటీసీ సలీం, మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హమీద్, మసూద్, కలీం తదితరులు పాల్గొన్నారు.

దళిత కల్యాణ మండపానికి భూమిపూజ

నవతెలంగాణ-నందిపేట్

మండలంలోని రైతుఫారం గ్రామంలో దళిత కళ్యాణ మండపానికి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెల్మల్ రాజన్న, ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి దళిత నాయకులతో కలిసి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వెల్మల్ రాజన్న మాట్లాడుతూ.. మండల కేంద్రంలో సుమారు రూ.15 కోట్లతో అన్ని కుల సంఘాలకు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కల్యాణ మండపాలు మంజూరు చేశారని దీనిలో భాగంగా తమ దళిత జాతికి కూడా కళ్యాణ మండపం మంజూరు చేసి ఎకరంనర భూమి ఫ్రీగా ఇచ్చి దీంతో పాటు రూ.50లక్షలు ప్రొసీడింగ్ కాపీ ఇచ్చారని తెలిపారు. కమిటీ చైర్మన్ వెల్మల్ రాజన్న, వైస్ చైర్మన్ ఎర్రటి మోహన్, పొగరి సంజీవ్, ప్రధాన కార్యదర్శులు అంకపల్లి రవి, జూల రవి, జీవన్, శ్రీధర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిత్యాన్నదానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గత కొన్ని నెలల నుంచి కొనసాగుతున్న నిత్యాన్నదానానికి రోజురోజుకూ విశేష ఆదరణ పెరుగుతోంది. కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు పండిత్ ప్రేమ్, పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, కౌన్సిలర్ కోనపత్రి కవిత కాశీరాం, తదితరులు పాల్గొన్నారు.

చేపూర్, గోవింద్‌పేట్‌లో ముగిసిన కంటి వెలుగు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సబ్ సెంటర్, చేపూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరం సోమవారం విజయవంతంగా ముగిసింది. మే 2 నుంచి ప్రారంభమై మే 22న ముగిసినట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని మానస తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరంలో మొత్తం 1818 మందికి కంటి పరీక్షలు చేయగా 237 మందికి ఆర్డర్‌పై కంటి అద్దాలను తెప్పిస్తున్నట్టు తెలిపారు. 140 మందికి దగ్గర చూపు లోపం ఉన్నవారికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్టు వివరించారు. 58 మందికి మోతిబిందు లోపం ఉన్నట్లు గుర్తించి వారికి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ సిఫార్సు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా చేపూర్ సర్పంచ్ ఇందూరు సాయన్న, ఎంపీటీసీ బాల నరసయ్య ఆధ్వర్యంలో కంటి వెలుగు క్యాంప్ అధికారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కంటి వెలుగు క్యాంప్ వైద్యాధికారి హుమెర యాస్మిన్, సూపర్‌వైజర్ రవీందర్, ఏఎన్ఎం సుల్తానా, కంటి వెలుగు డీఈవో మీరాబాయి, ఆప్తమిస్ట్ శ్యామల, ఆశా కార్యకర్తలు జ్యోతి, మంజుల, అనురాధ, ప్రమీల పాల్గొన్నారు.

దర్జీలు దర్జాగా బతికే తోవ చూపండి

నవతెలంగాణ-కోటగిరి

కుల వృత్తులను ఆర్థికంగా ఆదుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టనున్న పథకంలో మేరు (దర్జీ) కులస్తులను చేర్చి రూ.1లక్ష ఆర్థిక సహాయం అందజేయాలని ఉమ్మడి కోటగిరి మండల మేరు సంఘం అధ్యక్షులు గట్ల రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉమ్మడి మండలాలకు చెందిన మేరు(దర్జీ) కుల సంఘం ఆధ్వర్యంలో నిరసనలు తెలిపి రాష్ట్ర ప్రభుత్వం మేరు కుల సంఘానికి ఆర్థికంగా ఆదుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వద్దిల్‌వాల్ షాజీ, సభ్యులు కీర్తి రవి, సురేష్, కృష్ణ, లక్ష్మణ్, రాజు, రమేష్, అశోక్, సాయిరాం, కిషన్, గంగాధర్, నాగరాజు, రవి, సందీప్, కిరణ్, అశుతోష్, బజరంగ్, ఉదయ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికోద్యమ లెజెండ్ 'పర్సా సత్యనారాయణ'

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కార్మిక ఉద్యమ లెజెండ్ మన పర్స సత్యనారాయణ అని కార్మికోద్యమాలే తన ఊపిరిగా మలుచుకున్న మహోన్నతమైన నేత అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ తెలియజేశారు. సోమవారం పర్స సత్యనారాయణ 8వ వర్ధంతిని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దివెంకట్రాములు పర్సా ఫోటోకు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నూర్జహాన్ మాట్లాడుతూ.. కామ్రేడ్ పర్సా సత్యనారాయణ కార్మిక రాజ్యం సాధన కోసం పనిచేశారని తెలిపారు. అదేస్ఫూర్తితో కార్మిక ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గోవర్దన్, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కటారి రాములు, కృష్ణ, జిల్లా నాయకులు నరసయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సుజాత, ఐద్వా ఉపాధ్యక్షురాలు అనిత, నగర అధ్యక్షురాలు కటారి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

24న ఐద్వా సమావేశం

నవతెలంగాణ-కంఠేశ్వర్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఐద్వా మహిళా సంఘం ముఖ్యుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ నెల 24న ఐద్వా సంఘం విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఐద్వా బృందం తెలిపింది. ఈ సమావేశానికి ఐద్వా కార్యకర్తలు తప్పకుండా హాజరు కావాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు సుజాత, అనిత, లావణ్య, శ్రీ దేవీ, కళావతి, రజియా తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-బోధన్

బోధన్ సహకార సంఘం సొసైటీ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ ఆవరణలో సొసైటీ చైర్మన్ ఉద్మీర్ లక్ష్మణ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులను ఆదుకుని వారి పంటలకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించడానికి కృషి చేశారని అన్నారు. క్వింటాలు మొక్కజొన్నకు ప్రభుత్వం రూ.1962 మద్దతు ధర చెల్లిస్తుందని అన్నారు. ఎకరానికి 80 కిలోల చొప్పున 26 క్వింటాళ్ల మొక్కజొన్న మాత్రమే కొనుగోలు చేస్తుందని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మెన్ మానాబాయి, డైరెక్టర్లు పోశెట్టి, శ్రీనివాస్, శంకర్, ఏఎంసీ సిబ్బంది లింగం, సొసైటీ సీఈఓ ఉమాకాంత్ దేశ్‌ముఖ్, ఏఈఓ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ తెలంగాణ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-(బాల్కొండ)ఆర్మూర్

నియోజకవర్గంలో వైయస్సార్ తెలంగాణ పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యవతి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు వందన, మండల ఉపాధ్యక్షులు మహానంద, టౌన్ ప్రెసిడెంట్ అస్లాం ఖాన్, సెక్రెటరీ మజీద్, లక్ష్మీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉప్లూర్‌లో శ్రమదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండలంలోని ఉప్లూర్‌లో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా స్థానిక మహిళా సంఘం భవనంలో సోమవారం శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా సంఘం భవనం ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి, ఊడ్చి చెత్త చెదారం శుభ్రం చేశారు. శుభ్రం చేసిన చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ, ప్రత్యేక అధికారిణి రాగ సుధా, పంచాయతీ కార్యదర్శి నరేందర్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, ఐకేపీ సీసీ రవికుమార్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్‌రాజ్, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

- లేకుంటే కఠిన చర్యలే
- నిబంధనలు పాటించాలంటున్న అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



విద్యార్థులు స్కూల్‌కు వెళ్ళి విద్య నేర్చుకోవడం ఎంత ముఖ్యమో.. స్కూల్‌కు వెళ్లే విద్యార్థుల ప్రయాణ జాగ్రత్తలు అంతే అవసరం. అందుకే స్కూల్ బస్సు యజమానులు రవాణా శాఖ నిబంధనలు తప్పకుండా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. జూన్‌లో స్కూల్‌లు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ చేయించే విధానం, రవాణా శాఖ నిబంధనలను తెలుసుకుందాం.

ఇవీ నిబంధనలు..

స్కూల్ బస్సుకు ముందు హెడ్‌లైట్‌లు, ఇండికేటర్ లైట్‌లు, విద్యార్థులు కూర్చునే సీట్లు వాహన పరిమితికి తగినంతగా ఉండాలి. ఏ ఒక్క సీటు ఎక్కువగా ఉండకుండా విద్యార్థులు కూర్చునే సీట్లు బాగా ఉండే విధంగా, ఫైర్‌సేఫ్టీ రిఫిల్, ఫస్ట్ ఎయిడ్ కిట్ వాహనంలో ఉండాలి. వాహనం నడిపే డ్రైవర్‌కు బీపీ, షుగర్, ఇతర అనారోగ్య సమస్యలు ఉండకుండా 60 సంవత్సరాలు మించకుండా ఉండాలి. స్కూల్ బస్సు యజమాని డ్రైవర్‌కు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు నిర్వహించవలసి ఉంటుంది. డ్రైవర్ ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన సమాచారం స్కూల్ యజమానుల వద్ద రిజిస్టర్‌లో పొందుపరచాలి. స్కూల్ బస్సు నడిపించే డ్రైవర్‌కు డ్రైవింగ్‌లో కనీసం ఐదు సంవత్సరాల అనుభవం ఉండాలి. స్కూల్ బస్సులు ఎమర్జెన్సీ డోర్ ఏర్పాటు చేయాలి. స్కూల్ ఆవరణలో బస్సులకు ప్రత్యేక పార్కింగ్ స్థలం కేటాయించాలి. బస్సు ఏ రోడ్‌లో నడిపిస్తున్నారనే సమాచారాన్ని ముందుగానే ఆర్టీఓ కార్యాలయంలో పొందుపరచాలి. స్కూల్ బస్సు ప్రతినిత్యం వెళ్లే రూట్ మ్యాప్ పట్టికను బస్సులో ఏర్పాటు చేయాలి. స్కూల్ బస్సులో విద్యార్థులు వెళ్ళే సమయంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయున్ని ఖచ్చితంగా నియమించుకోవాలి. అలాగే వాహనాల ఫిట్‌నెస్‌ను సంవత్సరానికోసారి ఖచ్చితంగా చేయించాలి. ఫిట్‌నెస్ చేసే సమయంలో రోడ్ టాక్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, డ్రైవర్ లైసెన్స్, వాహనం ఆర్సీ, డ్రైవర్ ఆధార్‌కార్డు, ఆ బస్సుకు ఏర్పాటు చేసిన అటెండర్ ఆధార్ కార్డ్‌తో ఆ బస్సుకి జత చేసి ఏ రూట్‌లో బస్సును నడుపుతారో, ఆ రూట్‌ను కూడా ఆర్టీవో ఆఫీస్‌లో జత చేసి అనుమతిని పొందవలసి ఉంటుంది.

ఫిట్‌నెస్ లేకుంటే కఠిన చర్యలు



జిల్లాలో సుమారు 800ల బస్సుల వరకు ఉంటాయి. వీటన్నింటికీ ముందుగానే ఫిట్‌నెస్ పొందాలి. అప్పుడే స్కూల్ ప్రారంభించిన తర్వాత వాహనాలను నడిపేందుకు అనుమతిస్తాం. ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్డుపై నడిపిస్తే విద్యాసంస్థల యజమానులపైన కఠిన చర్యలు తీసుకుంటాం. జీవో నెంబర్ 35 నిబంధన ప్రకారం ఫిట్‌నెస్‌ను చేయించుకుని స్కూల్ బస్సులను నడపాలి.

- డాక్టర్ కె.వెంకటరమణ, డిప్యూటీ రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ కార్పొరేషన్ ఆఫీసర్

జీలుగ విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ-విలేకరుల బృందం

వేల్పూర్ : మండలంలోని మోతె పరిధిలో జీలుగ విత్తనాలను రైతులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నర్సయ్య, పాక్స్ మోతే చైర్మన్ యం.రాజేశ్వర్, సర్పంచ్ రజిత చంద్ర మోహన్, ఎంపీటీసీ డి.సత్యరాణి, రాజేశ్వర్‌రెడ్డి, సీఈఓ రాజేష్, రాజారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి(బాల్కొండ) : బాల్కొండ ప్రాథమిక సహకార సంఘం వద్ద సొసైటీ చైర్మన్ నాగులపల్లి సూరజ్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మహేందర్ రెడ్డి, మండల నాయకులతో కలిసి జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లావణ్య లింగాగౌడ్, జడ్పీటీసీ దాసరి లావణ్య వెంకటేష్, సర్పంచ్ భూస సునీత, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, వైస్ చైర్మన్ వేంపల్లి పెద్ద బాల్ రాజేశ్వర్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ నాగులపల్లి రాజేశ్వర్, ఎంపీటీసీ సభ్యులు కన్న లింగవ్వ పోశెట్టి, మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఫయాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ : మండలంలోని బోర్గాం (పి) సహకార సంఘం పరిధిలో ఎన్డీసీసీబీ డైరెక్టర్, బోర్గాం సహకార సంఘం చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షులు ఈగ జయకృష్ణ, డైరెక్టర్లు గంగాదాస్, కామర్స్ మోహన్, ముత్యాల నారాయణ, ఈగ సాయిరెడ్డి, చామకూర మహేందర్‌రెడ్డి, జి.నరేష్, కుచన్పల్లి బూజేందర్‌రెడ్డి, గాజుల సాయిబాబా, వేల్పూర్ లక్ష్మి, సహకార సంఘం సీఈవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని అర్గుల్ సొసైటీలో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ కుంచాల విమల రాజు రాయితీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. విత్తనాల కావాల్సిన



కమ్మర్‌పల్లి : బాల్కొండలో విత్తనాలు పంపిణీ..

రైతులు సొసైటీకి వచ్చేటప్పుడు ఆధార్ కార్డ్ జిరాక్స్, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్ అందజేసి విత్తనాలు తీసుకెళ్లాలని మండల వ్యవసాయాధికారి దేవిక తెలిపారు. ఒక్క బస్తా ధర రూ.842.70 ఉందని, పట్టా పాస్‌బుక్ 2-20 ఎకరాలకు ఒక్క బస్తా ఇవ్వనున్నట్టు తెలిపారు. అనంతరం మండల వ్యవసాయాధికారిణి దేవిక మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువులు భూమిలో కలియ దున్నడం ద్వారా భూమి క్షారత్వం తగ్గి చౌడు సమస్యను తగ్గిస్తుందని తెలిపారు. మొక్కకి కావలసిన నత్రజని, భాస్వారం, పొటాషియం, సల్ఫర్ వంటి మూలకాలను అందజేస్తుందని వివరించారు. సేంద్రియ కర్బనాన్ని పెంచుతుందని, కావున రైతులందరూ రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ అప్పల నడిపి రాజన్న, సర్పంచ్ పద్మ రాజేందర్, ఎంపీటీసీ జైడి పెద్దోళ్ల వనిత చిన్నరెడ్డి, అర్గుల్ క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణ అధికారి భాస్కర్‌నాయక్, జక్రాన్‌పల్లి క్లస్టర్ వెంకటేష్, సంఘం డైరక్టర్లు రైతులు పాల్గొన్నారు.

ధర్పల్లి : మండలంలోని రామడుగు సొసైటీలో ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌రెడ్డి జిలుగు, జనుము, సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ ధర్మయ్యగారి రాజేందర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్, సొసైటీ కార్యదర్శి ప్రవీణ్, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, కేశారం సర్పంచ్ సంగీత భాస్కర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సిరికొండ : మండలంలోని సిరికొండ, తూంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో జీలుగ విత్తనాలను రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ మంజుల, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ తిరుమల్, వైస్ ఎంపీపీ తోట రాజన్న, సొసైటీ చైర్మన్ మైలారం గంగారెడ్డి, రాములు నాయక్, మండల వ్యవసాయ అధికారి జాడి వెంకటేష్, సర్పంచ్ రాజారెడ్డి పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపైన రూ.842.70కు 30 కిలోల బస్తా అందిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సిరికొండ సర్పంచ్ ఎన్నం రాజారెడ్డి, తూంపల్లి సర్పంచ్ పల్లె బాలమణి మల్లేష్, డైరెక్టర్లు చిన్నారెడ్డి, నరసయ్య, రూప్‌సింగ్, సంతోష్‌రెడ్డి, రాజు రైతులు పాల్గొన్నారు.



వేల్పూర్ : మోతెలో విత్తనాలు పంపిణీ..

విజేతలకు సన్మానం

నవతెలంగాణ-జుక్కల్

సీఎం కప్‌లో భాగంగా జుక్కల్ మండలంలో నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన వారిని ఖండేభల్లూర్ సర్పంచ్ మహనంద, ఉప సర్పంచ్ విరేశం, ఎంపిటిసి భారతీబాయి ఘనంగా సన్మానించారు. మండల స్థాయిలో ఖండేభల్లూర్ జీపీ గ్రామ వాసులైన యువకులు కబడ్డీ, ఖోఖో ఆటలలో మొదటి స్థాయిలో గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు.


విజేతలను సన్మానించిన సర్పంచ్

నీటి సమస్య తీర్చండి

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని మూడవ వార్డులో గల దళిత అంబేద్కర్ కాలనీ ప్రజలకు తీవ్ర నీటి ఎద్దడి కొనసాగుతుందని ఈ కాలనీ ప్రజలకు నీటి సమస్య వారం రోజుల్లోగా తీర్చకపోతే ధర్నా ఆందోళన చేపడతామని ఆ వార్డు సభ్యురాలు లతా సాయిలు అన్నారు. సోమవారం గ్రామపంచాయతీకి వచ్చి సర్పంచ్ సురేష్ కు గ్రామ కార్యదర్శి సందీప్ కుమార్ కు రాతపూర్వకంగా వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీలో ఇంటింటికి కుళాయిలు లేవని బోరు పైప్లైన్ ద్వారా కాలనీకి నీటి సరఫరా చేస్తున్నారని కాలనీ ప్రజలకు నీటి విడుదల సక్రమంగా జరగడం లేదని నీటిని వదిలే వాటర్ మెన్ ను తొలగించాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.

పాల్వాంచ మండల రూపురేఖలు మారుస్తాం

- తహసీల్ కార్యాలయం ప్రారంభోత్సవంలో విప్ గంప గోవర్ధన్

నవతెలంగాణ-తాడ్వాయి

జిల్లాలో కొత్తగా ఏర్పడిన పాల్వంచ రూపురేఖలు మార్చడానికి కృషి చేస్తామని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అనానరు. నూతన మండల ఏర్పాటులో భాగంగా సోమవారం పాల్వంచ రైతు వేదికలో తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుదేశించి మాట్లాడారు. పరిపాలన ప్రజల ముందు ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కెసిఆర్ కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారని తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం అని చెప్పారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులు చేపట్టడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని వెల్లడించారు. పాల్వంచ మండలంలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కారం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఏడు ఎంపీటీసీ స్థానాలతో కొత్త మండలం పల్వంచ ఏర్పాటు అయిందని మండల ఏర్పాటు సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. మండలాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దిన్, ఎంపీపీ నర్సింగ్ రావు, జెడ్పిటిసి సభ్యుడు రామ్ రెడ్డి, సర్పంచ్ సునీత, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో బాలకృష్ణ, తాసిల్దారులు సాయిలు, సునీత, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విప్

25న జాబ్ మేళాపై సంతలో ప్రచారం

నవతెలంగాణ-మద్నూర్

ఈనెల 25న బిచ్కుంద మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిరుద్యోగ యువతీ యువకుల కోసం జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు సిండే ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళా ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం పంచుకోవాలని మద్నూర్ సంతలో సోమవారం నాడు ఆటో మైకు ద్వారా ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కోసం ఎమ్మెల్యే మన్మంత్ షిండే మంత్రి కేటీఆర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి సుమారు 50 కంపెనీలు ఉద్యోగాల భర్తీ కోసం జాబ్‌మేళాకు రానున్నట్టు తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో గల నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాను వినియోగించుకొని ఉద్యోగం పొందాలని నాయకులు సూచించారు.


ఆటోకు మైక్ పెట్టి ప్రచారం

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పోచారం భాస్కర్‌రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ మండల పరిధిలోని కొత్తబాద్ గ్రామంలోని తండాలో సోమవారం జరిగిన జగదాంబ మాత, సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, తాండా ప్రజలు పాల్గొన్నారు.

తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తాం

- రైతులు ఆందోళన చెందొద్దు : ఎమ్మెల్యే సురేందర్

నవతెలంగాణ-గాంధారి

రాష్ట్ర ప్రభుతం తడిచిన ధాన్యం సైతం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే సురేందర్ అన్నారు. గాంధారి మండల కేంద్రంలో ఆదివారం రాత్రికురిసిన భారీవర్షానికి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో వరి ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం ఉదయం గాంధారి వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎమ్మెల్యే సురేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆధార్య పడవద్దని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట జడ్పీటీసీ సభ్యులు శంకర్ నాయక్, ఏఎంసి చెర్మెన్ సత్యంరావు, సొసైటీ చెర్మెన్ సాయికుమార్, గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


తడిచిన ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వరి కొనుగోలు కేంద్రాలు పరిశీలన


కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఏడిఏ నూతన్ కూమార్ మండల ఎవో నవీన్ కూమార్‌తో కలిసి పరిశీలించారని ఏఈవో విజయ తెలిపారు. మహమ్మదాబాద్, కౌలాస్, ఖండేభల్లూర్ వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. తేమశాతం, ఇతర కొనుగోలులో ఎదురవుతున్న సమ్యలను అడిగి తెలుసుకున్నారు.

పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- కబ్జా భూమిని వెనక్కు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోకి వచ్చే సర్వేనెంబర్ 584 లో 3.11 ఎకరాల భూమి ప్రభుత్వ ఇళ్ల స్థలాల భూమిగా రికార్డులో ఉన్నా దానిని ఇతరులు కబ్జా చేసి వాడుకుంటుంటున్నారని, వెంటనే స్వాధీనం చేసుకొని పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం ఇంటి స్థలాన్ని కేటాయించాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు నాగేష్ కర్రే వార్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని, లేకుంటే పేదలతో కలిసి ఆందోళన చేపడతామని తెలిపారు.

పట్టించుకోకుంటే సమ్మెకు వెళ్తాం

- రేషన్ డీలర్‌ల సమ్మె నోటీసు అందజేత

నవతెలంగాణ-మద్నూర్

రేషన్ డీలర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి, పదిలక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలి, దిగుమతి హమాలి ప్రభుత్వమే భరించాలి ప్రతి ఎంఎల్ఎస్ పాయింటులో వే బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వం జూన్ 4వ తేదీలోగా పరిష్కరించకుంటే 5వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని రేషన్ డీలర్‌ల సంఘం మండల అధ్యక్షులు రమేశ్ దేశాయి స్పష్టంచేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలో తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉచిత బియ్యం పంపిణీ సందర్భంగా కరోనా సోకి చనిపోయిన 99 మంది డీలర్లకు ఎటువంటి నియమ నిబంధన లేకుండా కారుణ్య నియామకం కింద డీలర్ షిప్ ఇవ్వాలని, ఇతర నిత్యవసర సరుకులు పంపిణీ చెయ్యాలి, చనిపోయిన డీలర్ దహన సంస్కారాలకు 50 వేల ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. ఇతరాత్ర డిమాండ్‌లు పరిష్కరించ కుంటే సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంబ్లే పవన్ కోశాధికారి మీనాక్షి వీరితో పాటు మండలంలోని వివిధ గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు


వినతిపత్రం అందజేసి నినాదాలు చేస్తున్న రేషన్‌డీలర్‌లు

నిధులున్నా.. డబ్బుల్లేవ్

- రోడ్డు మరమ్మతులు అంతంతే


సగంలోనే నిలిచిన పనులు

నవతెలంగాణ-సదాశివనగర్

నియోజకవర్గంలో రోడ్ల బాగు కోసం రూ.60 కోట్లు నిధులు మంజూరైనట్టు ప్రజాప్రతినిధులు ఒక వైపు ప్రకటనలు చేస్తుండగా.. మరో వైపు రోడ్డు మరమ్మతుల కోసం నిధులు లేక పనులు సగంలోనే నిలిపివేయాల్సి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. మండలంలోని పద్మాజివాడి గ్రామంలో బీటీ రోడ్డు వేయగా.. రోడ్డు గుంతలు మయం కావడంతో మరమ్మతు పనులు చేపట్టారు. అయితే పనులు పూర్తి కాకముందే అధికారులు చేతులు ఎత్తేశారు. ఈ విషయమై ఆరా తీయగా.. నిధులు లేక పనులు నిలిచిపోయినట్టు పేర్కొంటుండటం గమనార్హం.

ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం కోసం భూమిపూజ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని అన్నా సాగర్ గ్రామంలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే జాజల సురేందర్ ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి భూమి పూజ చేసినట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి మంజూరు చేసిన ఎమ్మెల్యే జాజల సురేందర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ ఉమదేవి గురుప్రతాప్ గారు, గ్రామ ఉపసర్పంచ్ సుజాత రాజు, వార్డు సభ్యులు తులషవ్వ సంతోష్‌రెడ్డి బానుగౌడ్ ఎం.డీ. ఖాసీం, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దడిగే రాము గ్రామ పెద్దలు కొన్యల దుర్గరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న సర్పంచ్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-జుక్కల్

రోడ్డుపై నిలిపిన లారీని ప్రమాదవశాత్తు వెనుక వైపు నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి మండల కేంద్ర శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. జుక్కల్ ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని మర్తోళి గ్రామం గెగ్లూర్ తాలుకా, నాందేడ్ జిల్లాకు చెందిన దాదా రావ్ (46) ప్రయివేట్ ఉద్యోగి. నాలుగు రోజుల క్రితం తన అత్తగారింటికి వచ్చాడు. ఆదివారం బయటకువెళ్లిన ఆయన జుక్కల్ చౌరస్తా నుండి తిరిగి అత్తగారింటికి వస్తున్న క్రమంలో ముందు నిలిపి ఉన్న లారీని ఢీకొట్టడంతో మృతిచెందాడు. భార్య సునిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టుతెలిపారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టుతెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


రామారెడ్డిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అదనపు కలెక్టర్

- కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-తాడ్వాయి/రామారెడ్డి

క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతోందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని ఇంద్ర గాంధీ స్టేడియంలో సోమవారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల యువతి, యువకుల క్రీడ నైపుణ్యాలను వెలికి తీయడానికి సీఎం కప్ క్రీడా పోటీలు దోహదపడతాయని తెలిపారు. క్రీడాకారులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి రసూల్, వ్యాయామ ఉపాధ్యాయులు అనిల్ కుమార్, మధుసూదన్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.


కామారెడ్డిలో క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్

జట్టుగా కష్టపడితేనే విజయం

రామారెడ్డి: గ్రామాల్లో ఫుట్‌బాల్ ఆడటం చాలా తక్కువగా ఉందని, రామారెడ్డిలో యువత ఫుట్‌బాల్ పట్ల ఉన్న మక్కువ అభినందనీయమని, ఫుట్‌బాల్లో ఒకరు కష్టపడితే విజయం సాధించలేమని, జట్టుగా కష్టపడితేనే విజయం సాధిస్తారని అదనపు కలెక్టర్ అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సోమవారం జిల్లాస్థాయి సీఎం కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించించారు.

అనంతరం ఎంపీపీ దశరథ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ దండబోయిన సంజీవ్ మాట్లాడుతూ.. రామారెడ్డిలో యువత, విద్యార్థి దశ నుండే ఫుట్బాల్ ఆడుతుంటారని, కోచ్ తన్నీరు వేణు, అనిల్ కుమార్ లాంటి వారి సహకారంతో, రాత్రి వేళల్లో ఆట ఆడుకొనడానికి గ్రామపంచాయతీ పాలకవర్గం మైదానాన్ని, వెలుతురు కోసం విద్యుత్ దీపాల అలంకరణ, గ్రామ యువత ప్రోత్సాహంతో గ్రామంలో జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగడం అభినందనీయమని అన్నారు. జిల్లాస్థాయి ఫుట్బాల్ విజేతగా రామారెడ్డి, ద్వితీయ స్థాయిలో సదాశివనగర్ జట్లు గెలుపొందాయని తెలిపారు. ఈనెల 28న రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో ఈ జట్లు పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు బాలికొన్నంత జిల్లా పరిషత్ పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ ఉస్కె రాజేందర్ భోజన వసతులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి ఫుట్బాల్ ఇంచార్జ్ లింగం, స్థానిక ప్రధానోపాధ్యాయులు రాజులు, జిల్లా స్థాయి వ్యాయామ ఉపాధ్యాయులు, స్థానిక పీఈటీలు విజయలక్ష్మి, చందు, సాయి మౌర్య బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్, నాయకులు జంగం లింగం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని గండివెట్ గ్రామంలో రూ.43.00 లక్షలతో ముద్దెల్లి పీఏసీఎస్ నూతన పరిపాలన భవనం నిర్మాణాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డిలు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చెర్మెన్ సత్యంరావు, గాంధారి సొసైటీ చెర్మెన్ సాయికుమార్, ముద్దెల్లి సొసైటీ చెర్మెన్ సజ్జనపల్లి సాయిరాం, గండివేట్ సర్పంచ్ అబ్దుల్ ఫరూక్ పాల్గొన్నారు.

సీడీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-దోమకొండ

సీడీ సీ చైర్మన్‌గా ఐరేని నర్సయ్య జిల్లా కేంద్రం లోని సీడీసీ కార్యాలయం సోమవారం బాధ్యతలు స్వీకరి ంచారు. అనం తరం అయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్ గంపగోవర్దన్ తన పై నమ్మకం ఉంచి అప్ప గించిన బాధ్యతలను సక్ర మంగా నిర్వర్తిస్తానని, చెరకు రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మోతె ప్రభాకర్‌రెడ్డి జెడ్‌పిటిసి తీగల తిరుమల్ గౌడ్, మాజీ జెడ్పిటిసి టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంద్ర మధుసూదన్ రావు, సింగిల్ విండో మధు తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరించి మాట్లాడుతున్న నర్సయ్య

పేదలకు అండగా బీఆర్ఎస్

- ఎమ్మెల్యే జాజాల సురేందర్



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 57 మంది లింగంపేట్ మండల లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా బి ఆర్ ఎస్ పార్టీ ఉంటుంని దేశంలో ఎక్కడా లేని పథకాలు బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్నట్టు తెలిపారు. పేదల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సిఎం కెసిఆర్‌కే చెల్లిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిద్దారెడ్డి, ఎంపీపీ గరీబునిసా నయామ్, వైస్ ఎంపీపీ విట్టల్ రెడ్డి, లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని వ్యవసాయ సహకార సంఘంలో పచ్చి రొట్టె ఎరువులు అయిన జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు తీసుకోవాలని ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింహులు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం సి చైర్మన్ కాశీ నారాయణ, సొసైటీ డైరెక్టర్ ప్రకాష్ , మండల అధ్యక్షుడు జలెందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అధిములం సతీష్ , డైరెక్టర్‌లు పాల్గొన్నారు.


విత్తనాలు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 4
మంగళవారం 23 మే 2023

29వ రోజుకు వీవోఏల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-ఎడపల్లి

వీవోఏల నిరవధిక సమ్మె సోమవారం నాటికి 29వ రోజుకు చేరుకుంది. వీవోఏలకు నెలకు రూ.18వేల వేతనం మంజూరు చేయాలని, వీవోఏలకు రూ.10లక్షల సాధన బీమాతో పాటు ఆరోగ్య బీమా అమలు చేయాలని, గౌరవ వేతనం డీఆర్డీఏ ఖాతా నుంచి వీవోఏల బ్యాంక్ ఖాతాలోకి నేరుగా జమ చేయాలని, జీవో నెంబర్ 58ని సవరించాలన్నారు. కార్యక్రమంలో శోభ, సుదర్శన్, పోచయ్య, యూసుఫ్, నశిర వేగం, మహేశ్వరి, లతా, కుమ్మరి పుష్ప, జంగం సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులంలో ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో 2023-2024 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ ముబీన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తిగల, అర్హత గల అభ్యర్థులు కళాశాల కార్యాలయానికి ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి భాగ్యరెడ్డి వర్మ కృషి

- ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు
- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


నివాళులర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

దళిత మహిళలు, విద్యార్థుల అభ్యున్నతికి భాగ్యరెడ్డి వర్మ విశేషంగా కృషి చేశారని అధికారులు తెలిపారు. సోమవారం భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. దళితుల అభ్యున్నతికి దళిత మహిళల విద్యార్జన కోసం భాగ్యరెడ్డి వర్మ ఎనలేని కృషి చేశారని ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేశారు. భాగ్యరెడ్డి వర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించుకోవడం ద్వారా వారిని గౌరవించుకోవడంతో పాటు మహనీయుల స్ఫూర్తితో సమాజ హితం కోసం ముందుకు సాగేందుకు ఈ వేడుకలు దోహదపడుతున్నాయని అభిప్రాయపడ్డారు. భాగ్యరెడ్డి వర్మ 1906-1933 మధ్య హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారని ఆయన సేవలను కొనియాడారు. దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ అడుగుజాడల్లో నడవాలని, ఆయన ఆశయాలను కొనసాగించాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారిణి శశికళ, జెడ్పీ సీఈఓ గోవింద్, ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ రమేష్, జిల్లా కార్మిక శాఖ అధికారి యోహాన్, డీడబ్ల్యూఓ రసూల్ బీ, ట్రాన్స్‌కో ఎస్.ఈ రవీందర్, డీఈఓ దుర్గాప్రసాద్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వడ దెబ్బ తగలకుండా సూచనలు

- రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఫ్లెక్సీ ఏర్పాటు

నవతెలంగాణ-కంఠేశ్వర్


ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నిజామాబాద్ నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలను వివరిస్తూ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో ఏం చెయ్యాలో, ఏం చేయకూడదో ఫ్లెక్సీ ద్వారా ఎన్టీఆర్ చౌరస్తా, పులాంగ్ చౌరస్తా, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్టు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజామాబాద్ జిల్లా శాఖ చైర్మన్ బుస్స ఆంజనేయులు సోమవారం తెలిపారు. ఈ తీవ్రమైన ఎండల నుంచి ప్రతి ఒక్కరూ తమను తాము కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, తగు సూచనలు పాటించి వడదెబ్బకు గురికావొద్దని పేర్కొన్నారు.

కంటి వెలుగు వైద్య సిబ్బందికి సన్మానం


సన్మానం పొందిన వైద్యసిబ్బంది

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)

మండలంలోని చిక్కడపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సేవలందిస్తున్న వైద్య సిబ్బందిని అభినందిస్తూ బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జి పోచారం సురేందర్‌రెడ్డి సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కంటి వెలుగు కార్యక్రమంతో ఎందరో పేద ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలు, మందులు అందించారని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని విజయవంతం చేసింది వైద్య సిబ్బందేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ రమేష్, ఖాదర్, ఎంపీపీ సుజాత నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో యోగశాల భవనానికి భూమిపూజ


యోగశాల భవనానికి భూమిపూజ చేస్తున్న పలువురు

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)

మండలంలోని జేఎన్‌సీ కాలనీలో గల వెంచర్‌లో గ్రామపంచాయతీకి కేటాయించిన ఆ స్థలంలో యోగశాల నిర్మాణానికి బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జి పోచారం సురేందర్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగ ఆరోగ్యానికి ఎంతో మేలని అన్నారు. ప్రతి వ్యక్తి రోజు యోగ చేయటంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నారోజి గంగారం, ఎంపీపీ అక్కపల్లి సుజాత, సర్పంచ్ ఇందూరి శేఖర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పత్తి లక్ష్మణ్, సొసైటీ చైర్మన్ సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ సాయిలు, ఉప సర్పంచ్ కౌసర్, బీఆర్ఎస్ రుద్రూర్ గ్రామ అధ్యక్షులు గంగారం, నాయకులు బాలరాజ్, రామగౌడ్, సంజీవులు, కిషోర్, సలీం, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర ఐటీఐ కాలేజీలో సమస్యలను పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకుడు

ప్రభుత్వ బాలుర ఐటీఐ కాలేజీలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్ నగర కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలో శివాజీనగర్ వద్ద గల ఐటీఐ బాలుర కాలేజీ సమస్యలను పరిష్కరించాలని ఐటీఐ ప్రిన్సిపాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నగర ఉపాధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ.. వృత్తి విద్యా విధానం అయిన ఐటీఐ కాలేజీలో గత కొన్ని రోజులుగా కరెంట్ లేకపోవడం వలన విద్యార్థులకు ప్రాక్టికల్స్ సరిగ్గా జరగడం లేదని, అదే విధంగా థీరీ క్లాసులు కూడా క్లాసు బయట జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం బాధాకరమని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఈ సమస్యలను పరిష్కరించాలని లేనియెడల విద్యార్థులందరినీ ఏకం చేసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐటీఐ కాలేజీ కమిటీ సభ్యులు తరుణ్, వర్ధన్, శ్రీనివాస్, ప్రమోద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్


కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన సంఘం (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 9, 10వ తరగతులకు సంబంధించి ఏడు నెలల గుడ్ల బిల్లులు, ఒకటి నుంచి 8వ తరగతి వరకు రెండు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 3000 గౌరవ వేతనం జీవో విడుదల చేసినప్పటికీ వాటిని చెల్లించడం లేదని అన్నారు. 15 సంవత్సరాల క్రితం ఇచ్చిన వంట పాత్రలు పాడైపోయినప్పటికీ ఇప్పటికీ కొత్త వంట పాత్రలు ఇవ్వలేదని అన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు చామంతి లక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ గంగాధర్, కోశాధికారి పర్వమ్మ, ఉపాధ్యక్షులు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి కేసీఆర్

- ఎంపీపీ నల్ల సారిక

నవతెలంగాణ-ధర్పల్లి


చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షపాతి అని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మైలారం, చల్లగర్గ గ్రామాలకు చెందిన పంట నష్టపోయిన 90 మంది రైతులకు రూ.36 లక్షల 8వేల 902 రెండు రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరము ఆమె మాట్లాడుతూ.. గత సంవత్సరం జరిగిన పంట నష్టాన్ని స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం ఇప్పించినందుకు ఎమ్మెల్యే బాజిరెడ్డికి, జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మోహన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రామడుగు సొసైటీ చైర్మెన్ రాజేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, సర్పంచ్ కరోళ్ల రమేష్, ఉపసర్పంచ్ రాజు, ఎంపీటీసీ దివ్య, ఏవో ప్రవీణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన దళిత మైనారిటీ నాయకులు


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న భూపతిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన పలువురు దళిత నాయకులు, కొంతమంది మైనారిటీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు జక్రాన్‌పల్లి యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సొప్పరి వినోద్ తెలిపారు. సోమవారం నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్, బీజేపీని వీడి కాంగ్రెస్ పార్టీలో దళిత సభ్యులు వసంతరావు, మైనార్టీలు సభ్యులు రహమత్ అలీ వారి నాయకులు కార్యకర్తలతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గన్న చిన్న గంగారం, తిపిరి జనార్ధన్, తలారి శంకర్, తలారి గోపి, బండి చిన్న సాయన్న, మోతే సాయిలు, బియ్య గంగాధర్, సుంకరి శ్రీనివాస్, ఎస్కే సాజిద్, ఎమ్‌డీ ఖలీల్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు వినోద్ తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు చిన్నారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు సొప్పరి వినోద్, జిల్లా జనరల్ సెక్రెటరీ గన్న లక్ష్మణ్, మైనార్టీ మండలాధ్యక్షులు సైకిల్ టెక్స్ అక్బర్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ-రెంజల్


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సుదర్శన్‌రెడ్డి

కాంగ్రెస్ బీసీ సెల్ మండలాధ్యక్షులు లచ్చేవార్ నితీన్ తండ్రి లచ్చేవార్ మారుతి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. నితీన్‌తో పాటు ఆయన సోదరుడు కృష్ణను కలిసి ధైర్యాన్ని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చిరు ఉద్యోగులతో వెట్టి చాకిరి చేయించుకుంటూ వారికి కనీస వేతనాలు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని ఆయన ఎద్దేవా చేశారు. ఐకేపీ వీవోఏలుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇటీవల అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారని స్థానిక తహసీల్దార్ వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని విక్రయించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసి నెలల తరబడి అయినా ఇంతవరకు డబ్బులు రైతుల ఖాతాలో జమకావడం లేదని మర వెంకటేష్ ఆయన దృష్టికి తీసుకురాగా, స్థానిక అధికారులకు డబ్బులు వచ్చేలా చూడాలని ఆయన వారికి సూచించారు. మొలకెత్తిన ధాన్యాన్ని సరసమైన ధరలకు విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు నెలల తరబడి బకాయిలు చెల్లించకపోవడంతో పౌష్టికాహారంలో స్పష్టంగా లోపం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంతిరెడ్డి రాజిరెడ్డి, మహమ్మద్ జావిద్ ఉద్దీన్, ఎంఎల్.రాజు, కంఠం గంగారాం, సాయిలు, సంతోష్, రాకేష్, మార వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లారీల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్


మాట్లాడుతున్న పల్లపు వెంకటేశ్

నవతెలంగాణ-ఆర్మూర్

లారీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు వడ్లను కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకువచ్చినప్పటికీ వడ్లను తూకం వేయకపోవడంతో అకాల వర్షానికి తీవ్ర నష్టం జరిగిందని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. తూకం వేసిన వడ్లు కూడా లారీలు లేకపోవడంతో ఆదివారం కురిసిన వర్షానికి తడిసిపోయాయని తెలిపారు. వర్షాల వల్ల తడిసిన ధాన్యానికి రైస్‌మిల్స్ యజమానులు ఏడు నుంచి పది వరకు కిలోల తరుగు తీస్తున్నారని అలా తీయకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు నష్టపోయిన రైతులకు సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోకట్టి భూమేశ్వర్, వెలుమల చిన్న మల్లయ్య, తెనుగు చిన్న గంగారం తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ రకాల పోటీ పరీక్షల తరగతులు భోధించడానికి ఆసక్తి కలిగిన అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.శశికళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో అనుభవం కలిగి పీజీలో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, అయిదు నెలల ఉచిత శిక్షణలో ఆంగ్లం, అర్థమెటిక్, రీజనింగ్, జాగ్రఫీ, పాలిటీ, సోషియాలజీ, భారత-తెలంగాణ చరిత్ర తెలంగాణ ఉద్యమ చరిత్ర, కరెంట్ ఎఫైర్స్, అర్థశాస్త్రం, భౌతిక, రసాయన, జీవశాస్త్రంతో పాటు సైన్స్ అండ్ టెక్నాలజీ బోధించే అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు ఎస్సీ స్టడీ సర్కిల్ కార్యాలయం, ఎస్సీ బాలుర కాలేజీ హాస్టల్ (బి), నాందేవ్‌వాడలో సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు 9491468799 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. శిక్షణా తరుగతులు జూన్ 1వ తేదీ నుంచి అక్టోబర్ 31 వరకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

క్యాటరింగ్ చేయుటకు టెండర్లు ఆహ్వానం..

నిజామాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ నందు నిర్వహించే ఉచిత శిక్షణలో భాగంగా గరిష్ఠంగా వందమంది విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేయడానికి క్యాటరింగ్ యాజమాన్యం నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.శశికళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి విద్యార్థికి రోజుకు రూ.75 చొప్పున గరిష్ఠంగా వంద మంది విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, టీ అండ్ స్నాక్స్, రాత్రి భోజనాన్ని మెనూ ప్రకారం ఐదునెలలు నిరంతరంగా ఏర్పాటు చేయాలని తెలిపారు.

వివరాలకు నిజామాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.శశికళను సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 08462-295301 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. శిక్షణా తరుగతులు జూన్ 1వ తేదీ నుంచి అక్టోబర్ 31 వరకు నాందేవ్‌వాడలో గల ఎస్సీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

మన ఊరు-మనబడి పనులు తనిఖీ


పనులను తనిఖీ చేస్తున్న ఏఈ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలో కొనసాగుతున్న మన ఊరు-మన బడి పనులను పంచాయతీరాజ్ ఏఈ రాగ సుధా సోమవారం సందర్శించి పరిశీలించారు. మండల పంచాయతీరాజ్ ఏఈగా బాధ్యతలు స్వీకరించిన ఆమె పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాల భవనం పనుల విషయంలో మెటీరియల్ వర్క్, పెంటింగ్ వర్క్‌పై కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. వేసవి సెలవులు పూర్తయి, పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా త్వరితగతిన మన ఊరు మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులన్నింటినీ పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సక్కారం అశోక్, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్, ఎస్ఎంసీ చైర్మన్ తోపారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ యూత్ క్విజ్ పోటీల్లో పాల్గొనండి

- పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

యువత రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ యూత్ క్విజ్ పోటీల్లో పాల్గొనాలని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం కాంగ్రెస్ భవన్ నందు పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యనిర్వాక అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన రాజీవ్‌గాంధీని స్మరించుకుంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూన్ రెండవ తేదీన రాజీవ్ గాంధీ ఆన్లైన్ యూత్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జూన్ ఒకటవ తేదీ వరకు 7661899899 మిస్‌కాల్ ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, జూన్ రెండవ తేదీన పరీక్ష నిర్వహిస్తామని, 16 నుంచి 35 సంవత్సరాలున్న యువకులు ఈ పోటీలో పాల్గొనవచ్చని, క్విజ్ కాంపిటీషన్‌లో 60 ప్రశ్నలు గంట సమయం ఉంటుందని తెలియజేశారు. 7661899899 మిస్ కాల్ ఇస్తే మీ నంబరుకు ఒక ఆన్లైన్ లింక్ వస్తుందని, దానిలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, కాంగ్రెస్ కమిటీ నగర అధ్యక్షుడు కేశ వేణు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు విక్కీ యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు రాజ నరేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.